సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 22 । నవంబర్ । 2024

టెస్ట్‌ల్లో నేడు నితీష్ అరంగేట్రం?

నేటి నుంచి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్ట్



తుది జట్టులో చాన్స్ లభించే అవకాశాలు పుష్కలం 8లో

నాటక జ్యోతి రంగసాయి

- బాదంగీర్ సాయి మృతితో మూగబోయిన రంగస్థలం
- పలువురు ప్రముఖుల నివాళులు
- సురభి నాటకాలకు పూర్వ వైభవంలో ఆయన కృషి అమోఘం 8లో





8లో

మేమే మేటి.. లేరు సాటి!

జానపద, శాస్త్రీయ నృత్యాలు, మైమ్, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు స్నేహం, సమాజ సేవపై తెలుగులో సంభాషణ, నీతి శతక పద్యాలతో చిన్నారుల సంబరం అంబరాన్నంటింది. సెయింట్ ఆంథోనీ పాఠశాలలో నిర్వహించిన బాలోత్సవం వైభవంగా ముగిసింది.

నేషనల్ యూత్ ఫెస్ట్‌లో ఏయూ విద్యార్థుల సత్తా



శివాని లహరి, హర్షిత

సాక్షి, విశాఖపట్నం : నేషనల్ యూత్ ఫెస్ట్‌లో ఏయూ విద్యార్థులు సత్తా చాటారు. వేర్వేరు విభాగాల్లో విన్నర్, రన్నర్‌లుగా నిలిచారు. ప్రజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన 'ప్రజాతంత్రం–2024' నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ఏయూలోని అంబేడ్కర్ న్యాయ కళాశాలకు చెందిన దేవగుప్తపు హర్షిత, శివాని లహరి పాల్గొన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకూ లక్నోలో జరిగిన ఫైనల్స్‌లో పాలసీ వ్యవహారాలపై జరిగిన డిబేట్ పోటీల్లో హర్షిత అదరగొట్టింది. దేశంలోని వివిధ కాలేజీలకు చెందిన 18 మందిని వెనక్కి నెట్టి నంబర్ వన్‌గా నిలిచింది. సామాన్య ప్రజలను పరిపాలనలో ఎలా భాగస్వామ్యం చేస్తారనే అంశంపై జరిగిన పోటీల్లో మైలవరపు శివాని లహరి అద్భుత ప్రతిభ కనబరిచి సెకండ్ రన్నరప్‌గా నిలిచింది. అవార్డులు సాధించిన విద్యార్థినులను ఏయూ వీసీ శశిభూషణరావు, న్యాయకళాశాల ప్రిన్సిపాల్ సీతామాణిక్యం, మెంటార్ పల్లవి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కూటమి చేతుల్లో పరేషన్



లలితానగర్‌లో బియ్యం తీసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు

రేషన్ బియ్యాన్ని బొక్కేస్తున్న కూటమి నేతలు

మిల్లర్ల సహకారంతో టన్నుల కొద్దీ అక్రమ నిల్వలు

- ఎండీయూ వాహనదారులకు ఎర వేసి బియ్యాన్ని దోచేస్తున్న వ్యాపారులు
- కూటమి నేతల్ని కాపాడేందుకు చిరు వ్యాపారులపై దాడులు
- రెండు నెలల్లో 37,800 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



పెద్దిపాలెం రైస్‌మిల్లులో రేషన్ బియ్యం(ఫైల్)

సాక్షి, విశాఖపట్నం :

జిల్లాలో మొత్తం 648 చౌకధరల దుకాణాల ద్వారా 5,17,732 మంది కార్డుదారులకు 8,161 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతి నెలా సరఫరా చేస్తుంటారు. పేదలు రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం, ఇతర నిత్యావసరాలు తెచ్చుకోవడం కష్టమవుతుందంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రేషన్ బియ్యాన్ని ఇంటింటికి అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వాహనాల దగ్గరే అసలు దందా మొదలుపెట్టారు.

- ఈ నెల 16న ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని రైస్ మిల్లులో పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేసి 3 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు.
- ఈనెల 10వ తేదీ నరవలో నిల్వ ఉంచిన 1800 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు.
- ఈ నెల 8న అగనంపూడిలో అక్రమంగా తరలిస్తున్న 4,300 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు.
- గత నెల 16న చినముషిడివాడలో అక్రమంగా నిల్వ ఉంచిన 630 కిలోల పీడీఎస్ బియ్యాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారులు పట్టుకున్నారు.

ఇవి కేవలం చిన్న తిమింగళాలే.. కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతున్న రేషన్ మాఫియాని కట్టడి చేసేందుకు మాత్రం పౌర సరఫరాల శాఖ అధికారులు భయపడుతున్నారు. కొందరు అధికారులైతే చోటా నేతలు, డీలర్లతో కుమ్మక్కై జేబులు నింపేసుకుంటున్నారు. టన్నుల కొద్దీ అక్రమ నిల్వలున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

బియ్యం ఇవ్వం.. డబ్బులు తీసుకోండి..!



బియ్యం ఇవ్వకుండా డబ్బులు మాత్రమే ఇస్తున్న ఎండీయూ వాహనం

వాహనం వద్దకు వచ్చిన లబ్ధిదారులకు బియ్యం ఇవ్వం. డబ్బులిస్తాం తీసుకెళ్లండి అంటూ దందా చేస్తున్నారు. మాకు డబ్బులొద్దు.. బియ్యం కావాలని అడిగితే కిలోకి అదనంగా రూపాయి చొప్పున చెల్లిస్తున్నారే తప్ప.. బియ్యం ఇచ్చేందుకు చాలా మంది ఎండీయూ వాహదారులు ఇష్టపడటం లేదు. లబ్ధిదారుల దగ్గర బియ్యాన్ని కిలో రూ.12కి కొంటున్నారు. ఎండీయూ వాహనాల నుంచి 'రేషన్ మాఫియా' ఈ బియ్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు విక్రయిస్తున్నారు. మిల్లర్లు రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టించి కిలో రూ.30 నుంచి రూ.40లకు వ్యాపారులకు అమ్ముతున్నారు. పాలిష్ చేసిన ఈ బియ్యాన్ని తిరిగి ఆ పేదలే సన్నబియ్యంగా భ్రమపడి.. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.45 నుంచి రూ.55 ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

అంతా కూటమి కనుసన్నల్లోనే.!

జిల్లాలో కూటమి నేతల కనుసన్నల్లో రేషన్ బియ్యం మాఫియా నడుస్తోంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో రేషన్ బియ్యం సక్రమంగా లబ్ధిదారులకు అందేవి. కూటమి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేల అండదండలతో ఆ పార్టీలకు చెందిన చోటా నేతలు బియ్యం దందా నడుపుతున్నారు. ప్రతి నియోజకవర్గాన్ని ఆ పరిధిలోని నాయకుడు చెప్పుచేతుల్లోకి తీసుకొని.. బియ్యాన్ని అక్రమంగా తరలించేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యం సేకరించేందుకు ప్రత్యేకంగా కూలీలను ఏర్పాటు చేసుకుని దందా కొనసాగిస్తున్నారు. ఇటీవల విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో నెల రోజుల వ్యవధిలోనే ఏకంగా 37,800 టన్నుల వరకూ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారంటే అసలు దందా ఎలా నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు.



నరవలో పట్టుబడిన పీడీఎస్ బియ్యం

మిల్లర్లదే ముఖ్య భూమిక..!

జిల్లాలో సేకరించిన రేషన్ బియ్యం కూటమి నేతల కనుసన్నల్లో నడుస్తున్న మిల్లులకు చేరుతున్నాయి. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి పరిధిలో విశాఖ నగరంతోపాటు భీమిలి, పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి మండలాలు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో సేకరించిన బియ్యం మొత్తం ఆనందపురం మండలంలోని పెద్దిపాలెంలో ఉన్న రైస్ మిల్లులకే చేరుతుంటాయని అధికారులందరికీ తెలిసిన విషయమే.. కానీ ఏమీ తెలియనట్లు నిద్ర నటిస్తుంటారు. ఎప్పుడైనా తమకు మామూళ్లు అందకపోతే వెంటనే మిల్లుపై దాడి చేయడం.. ఎందుకూ కొరగాని 6(ఏ) కేసు నమోదు చేయడం.. తమ వాటా వచ్చిన వెంటనే.. కేసు మాఫీ చేసేయడం.. ఇదే తంతుగా మారింది. అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలో ఈ బియ్యం కొనుగోలు చేసే మిల్లులున్నాయి. ఇలా.. రేషన్ మాఫియాలో మిల్లర్లు ముఖ్య భూమిక పోషిస్తుంటే.. ఆ బియ్యాన్ని డబ్బులు రూపంలో మార్చడంలో మాత్రం కూటమి పార్టీల చోటా నేతలే చక్రం తిప్పుతున్నారు.

చిన్న చేపలపైనే వల.!

రేషన్ బియ్యం అక్రమాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. జిల్లాలో రోజూ ఏదో ఒక చోట రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామంటూ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రకటిస్తున్నారు. వీటిని చూస్తే అధికారులు భేషుగ్గా పనిచేస్తున్నారని అనుకుంటే పొరపాటే. తమ చేయి తడపని వ్యాపారులు, మిల్లర్లు.. కూటమి నేతలకు సహకరించని వారిపైనే ఈ దాడులు జరుగుతున్నాయి. అసలు దొంగలకు మాత్రం సంపూర్ణ సహకారాలను అందిస్తున్నారు. వాస్తవానికి ప్రతి నెలా మొదటి తేదీలోపు సివిల్ సప్లయ్ గోదాముల ద్వారా నిర్దేశిత రేషన్ షాపులకు పీడీఎస్ బియ్యం సరఫరా అవుతోంది. అయితే స్టాక్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కడైనా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులు వస్తే.. తమకు మామూళ్లు ఇచ్చేవాళ్లా.. లేదా.. చూసుకొని దాడులు చేస్తున్నట్లు సమాచారం.

అలరించిన సీ విజిల్ విన్యాసాలు



సాక్షి, విశాఖపట్నం : తీర ప్రాంతంపై భారత రక్షణ దళం పట్టుని ప్రదర్శించేందుకు ఏటా నిర్వహిస్తున్న సీ విజిల్ ఘనంగా ముగిసింది. రెండు రోజుల పాటు భారత నౌకాదళం నేతృత్వంలో సీవిజిల్–2024 పేరుతో యుద్ధ విన్యాసాలు జరిగాయి. సముద్ర తీర రేఖ కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిశా, పుదుచ్చేరి సహా 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ విన్యాసాలు విజయవంతంగా నిర్వహించారు. మొత్తం 6 మంత్రిత్వ శాఖలు, 21 విభాగాలు, ఏజెన్సీలు ఈ విన్యాసాల్లో భాగస్వామ్యమయ్యాయి. మత్స్యకారుల రూపంలో ఉగ్రమూకల చొరబాటు, చేపల వేటకు వెళ్లి సరిహద్దులు దాటిన జాలర్లను సురక్షితంగా తీసుకురావడం, ఆకస్మిక దాడుల్ని సమర్థవంతంగా ఎదుర్కోవడం.. ఇలా.. భిన్నమైన విన్యాసాలతో అలరించారు.

నేటి నుంచి సోలార్ ఎక్స్‌పో



సాక్షి, విశాఖపట్నం : సౌర విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శుక్రవారం నుంచి సోలార్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు ఏపీ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.హేమకుమార్ తెలిపారు. ఎక్స్‌పో వేదికైన ఏయూ హెలిప్యాడ్ గ్రౌండ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ రీ నెక్స్ పేరుతో సోలార్ రెన్యువబుల్ ఎనర్జీ ఎక్స్‌పో–2024 నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ కార్యక్రమానికి మద్దతుగా రూఫ్ టాప్ సోలార్‌పై ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. గ్రీన్ ఎనర్జీ సోలార్ సెల్ కన్వీనర్ సీహెచ్.రామమోహన్‌రావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎక్స్‌పోలో ఏపీలోని వివిధ రకాల సోలార్ సంస్థలు, రుణసహాయాన్ని అందించే బ్యాంకులు, స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తాయన్నారు. ఈ ప్రదర్శనకు ఏపీఈపీడీసీఎల్, నెడ్‌క్యాప్, రాష్ట్ర ప్రభుత్వం సహకారమందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.నాగరాజు, కోశాధికారి సీహెచ్ జయబాబు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో.. కాసుల వేట



- మద్యం తాగి వాహనాలు నడిపే వారి నుంచి ముక్కుపిండి 'వసూళ్లు'
- కేసులు కోర్టుకు వెళ్లకుండా పక్కదారి పట్టిస్తున్న పోలీసులు
- రెండు నెలల క్రితమే ఒక ట్రాఫిక్ ఎస్‌ఐ సస్పెన్షన్
- తాజాగా ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ, రైటర్‌పై సీపీ వేటు

విశాఖ సిటీ : ఖాకీల 'మామూళ్ల' మత్తు వదలడం లేదు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని దోచేస్తున్నారు. బ్రీత్ ఎనలైజర్‌లో రీడింగ్ 200 దాటినా.. మందుబాబులు కోర్టుకు వెళ్లే పనిలేకుండానే కేసులను పక్కదారి పట్టిస్తున్నారు. వారి నుంచి ముక్కుపిండి వసూలు చేసి తమ జేబులు నింపుకుంటున్నారు. వరుసగా జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనం. తాజాగా ఇదే వ్యవహారంలో మరో ఎస్‌ఐ, రైటర్‌పై వేటు పడింది. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పోలీసులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. నిత్యం ప్రతి జంక్షన్‌లో బ్రీత్ ఎనలైజర్లు పట్టుకొని రహదారుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసుల్లో కొంత మంది తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

వాహనాన్ని బట్టి వసూలు

రహదారి భద్రతలో భాగంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ డ్రైవ్‌లను కొంత మంది పోలీసులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. మద్యం తాగి వాహనాలను నడిపిన వారు బ్రీత్ ఎనలైజర్ తనిఖీల్లో పట్టుబడితే వారి వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఆ తరువాత రోజు బేరం మొదలు పెడుతున్నారు. కొంత మంది ఏకంగా మధ్యవర్తులను సైతం పెట్టుకొని వాహనదారులతో బేరసారాలు కొనసాగిస్తున్నారు. వాహనాన్ని బట్టి రూ.5 వేలు నుంచి రూ.20 వేలు వరకు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే కోర్టుకు వెళ్లాల్సి ఉంటుందని, జైలు శిక్ష పడుతుందని, లేదా రోడ్ల మీద ప్లకార్డులు పట్టుకొని నిలబడి పరువు తీసుకోవాల్సి వస్తుందని, డ్రైవింగ్ లైసెన్సు కూడా రద్దయిపోతుందని బెదిరింపులకు దిగుతున్నారు. అలా జరగకుండా ఉండాలంటే చెప్పిన మొత్తాన్ని ముట్టజెప్పాలని గదమాయిస్తున్నారు.

కోర్టుకు వెళ్లకుండా కేసుల మాయం

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మందుబాబులు దొరికితే కొందరు పోలీసులు వారి నుంచి మామూళ్లు తీసుకొని కేసులను కోర్టులకు వెళ్లకుండా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొద్ది నెలల క్రితం వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో ఎస్‌ఐ ఆటో డ్రైవర్‌ను ఇదే మాదిరిగి తప్పించారు. ఈ వ్యవహారంపై సాక్షి కథనంతో సదరు ఎస్‌ఐపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. అయితే సదరు ఎస్‌ఐ ఆ స్టేషన్ హోంగార్డు ద్వారా ఒక వార్డ్రోబ్‌ను ట్రాఫిక్ ఉన్నతాధికారికి బహుమతిగా ఇవ్వడంతో విచారణను పక్కకు పెట్టేశారన్న గుసగుసలు వినిపించాయి. రెండు నెలల క్రితం బీచ్ రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మహారాణిపేట స్టేషన్ ఎస్‌ఐ మద్యం తాగి వాహనాన్ని నడిపే వారిని పట్టుకున్నారు. ఒక ఆటో డ్రైవర్ ద్వారా డబ్బు వసూలు చేసి ఆ వాహనదారుడిని వదిలేశారు. ఈ విషయం సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టికి వెళ్లడంతో రహస్యంగా విచారణ చేయించారు. అది వాస్తవమని నిర్ధారణ అవడంతో ఎస్‌ఐతో పాటు హోంగార్డును సస్పెండ్ చేశారు.

ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ సస్పెన్షన్


ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ ఎన్.వి.భాస్కరరావు అటాచ్‌మెంట్‌పై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మధ్యలో స్పెషల్ డ్రైవ్ నిమిత్తం ఎస్‌ఐ భాస్కరరావు వేరే ప్రాంతానికి వెళ్తూ ఏఎస్‌ఐని తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. సదరు ఏఎస్‌ఐ, ఇతర సిబ్బంది తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాన్ని నడుతున్న వ్యక్తిని పట్టుకున్నారు. అతడిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. వాహనం తాళాన్ని ద్వారకా ట్రాఫిక్ స్టేషన్ రైటర్‌కు అప్పగించారు. పట్టుబడిన వ్యక్తి ఒక మధ్యవర్తితో ద్వారకా స్టేషన రైటర్ సిహెచ్.జయరావును సంప్రదించాడు. వాహనదారుడి నుంచి రైటర్, ఎస్‌ఐ డబ్బు తీసుకొని కేసును కోర్టులో ప్రవేశపెట్టకుండా డిస్పోజ్ చేసేశారు. ఈ విషయం కూడా సీపీ దృష్టికి వెళ్లింది. దీనిపై కమిషనర్ సమగ్ర విచారణకు ఆదేశించారు. ఇందులో వారిపై ఆరోపణలు నిజమని నిర్ధారణైంది. దీంతో ఎస్‌ఐ, రైటర్‌లను గురువారం సీపీ శంఖబ్రత బాగ్చి సస్పెండ్ చేశారు. అలాగే వారిపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలకు ఆదేశించారు.

డీల్ కుదిరితే ఓకే!

- దోచుకోవడమే లక్ష్యంగా స్థాయీ సంఘ సమావేశాలు
- కాంట్రాక్టర్లతో నేరుగా బేరసారాలు?
- సానుకూలంగా ఉంటే జై.. లేకపోతే వాయిదా

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశాలు దోచుకోవడమే లక్ష్యంగా సాగుతున్నాయి. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్న చందంగా కాంట్రాక్టర్లతో నేరుగా సభ్యులు బేరాలు మాట్లాడుకుంటున్నారు. డీల్ కుదిరితే సమావేశంలో ఆ అంశానికి జై కొట్టడం.. లేకపోతే వాయిదా వేయడం పరిపాటిగా మారింది. శుక్రవారం స్థాయీ సంఘ సమావేశం ఏర్పాటు చేయగా గురువారం రాత్రి వరకు ఈ వ్యవహారంపై చర్చోపచర్చలు జరిగినట్లు తెలిసింది.

మూడు నెలలకోసారి నిర్వహించే జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో సుమారు వంద అజెండా అంశాలతో పాటు మరికొన్ని టేబుల్ అజెండా అంశాలు చర్చకు వస్తుంటాయి. అలాంటిది వారానికోసారి నిర్వహించే స్థాయీ సంఘ సమావేశంలో పుంఖాను పుంఖాలుగా అంశాలు పుట్టుకొచ్చేస్తున్నాయి. అంటే ఏ తీరున స్థాయీ సమావేశాలు జరుగుతున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. నూతన స్థాయీ సంఘం తొలిసారిగా సెప్టెంబర్ 20న సమావేశమైంది. ఈ సమావేశంలో 280 అంశాలు, అక్టోబర్ 4న నిర్వహించిన సమావేశంలో 124 అంశాలతో పాటు మరో 19 టేబుల్ అజెండా అంశాలు, ఈ నెల 8న నిర్వహించిన స్థాయీ సమావేశంలో 71 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు వచ్చాయి. వీటిలో సభ్యులకు అనుకూలంగా ఉన్న అంశాలన్నీ ఆమోదం పొందాయి. సభ్యులకు తెలియకుండా ఏ అంశం చర్చకు వచ్చినా వాయిదా వేస్తున్నారు. ఇదిలా ఉండగా.. శుక్రవారం నిర్వహించనున్న సమావేశంలో 117 అంశాలు పొందుపరిచారు. ఇప్పటి వరకు జరిగిన స్థాయీ సంఘ సమావేశాల్లో కాంట్రాక్టర్‌తో ఒప్పందాలు పూర్తయిన వాటికి సభ్యులందరూ ఒకే చెప్పారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



నేడు స్థాయీ సంఘ సమావేశం

మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ హరివెంకటకుమారి అధ్యక్షతన శుక్రవారం స్థాయీ సంఘ సమావేశం జరగనుంది. ఎజెండాలో మొత్తం 117 అంశాలను పొందుపరిచారు.

గతంలో అలా.. ఇప్పుడు ఇలా..

గత ప్రభుత్వ హయాంలో స్థాయీ సంఘం సమావేశం నిర్వహించే తేదీకి మూడు, నాలుగు రోజుల ముందుగా సభ్యులకు అజెండాలో పొందుపరిచిన కాపీని పంపేవారు. సభ్యులు ఆ అంశాలపై పరిశీలన చేసి, సమావేశంలో చర్చించి ఆమోదించేవారు. ఆ పరిస్థితి ఇప్పటి స్థాయీ సమావేశాల్లో కనిపించడం లేదు. ప్రస్తుతం ప్రతి శుక్రవారం సమావేశం నిర్వహించాలని సభ్యులు తీర్మానించారు. అనివార్య కారణాల వల్ల అప్పుడప్పుడు వాయిదా పడుతున్నాయి. శుక్రవారం సమావేశమైతే గురువారం పొద్దుపోయే వరకు ఏ అంశం అజెండాలో ఉండాలో.. వద్దో ఇటు అధికారులు, అటు స్థాయీ సభ్యులు తేల్చుకోలేకపోతున్నారు. స్థాయీ సభ్యులు, కాంట్రాక్టర్ల మధ్య బేరాలు కుదిరితే ఆ అంశాన్ని అజెండాలో పొందుపరిచి.. నామమాత్రంగా చర్చించి ఓకే చేస్తున్నారు. సభ్యులకు తెలియకుండా ఏదైనా అంశం ఆమోదం కోసం సమావేశానికి వస్తే నిర్మోహమాటంగా తిరస్కరిస్తున్నారు.

మార్గశిర మాసోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

మహారాణిపేట: వచ్చే నెల 2 నుంచి 30 వరకు కనకమహాలక్ష్మి దేవస్థానంలో జరగనున్న మార్గశిర మాసోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేందిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమీక్ష జరిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులేకుండా పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, సరిపడా క్యూలైన్లు, మంచినీటి సదుపాయం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ, అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, నిత్యాన్నదానం, ప్రసాదం కౌంటర్, క్యూలైన్ల వద్ద సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు జగన్నాథస్వామి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ ఉంటుందని, డిసెంబర్ 26న మహాన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉప కమిషనర్, ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. ఉచిత, సర్వ దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తూ వీఐపీ పాసులను పరిమితం చేసి, దర్శన వేళలను కుదించామన్నారు. జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ఈఈ సీహెచ్‌వీ రమణ, అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో ఈవో శోభారాణి, ఈఈ సీహెచ్‌వీ రమణ

24న విశాఖ మ్యూజియంలో ఉచిత ప్రవేశం

డాబాగార్డెన్స్: వరల్డ్ హెరిటేజ్ వీక్ సందర్భంగా ఈ నెల 24న విద్యార్థులకు, సందర్శకులకు విశాఖ మ్యూజియంలో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. వరల్డ్ హెరిటేజ్ వీక్ సందర్భంగా పురావస్తు శాఖ, ఇంటాక్ సంయుక్తంగా ఆ రోజున కందుల వేంకటేష్ సేకరించిన నాణేలు, శిలాజాలను ప్రత్యేకంగా విశాఖ మ్యూజియంలో ప్రదర్శించనున్నట్టు చెప్పారు.

నాటక జ్యోతి.. రంగసాయి

బాదంగీర్ సాయి మృతితో మూగబోయిన రంగస్థలం • పలువురు ప్రముఖుల నివాళులు



బాలబాట వార్షికోత్సవంలో సాయికి సన్మానం(ఫైల్)

కలలోనూ కళ కోసం తపించి.. కళను కాపాడేందుకు అమలాపురం నుంచి వచ్చిన ఆపద్బాంధవుడు బాదంగీర్ సాయి. రంగస్థల జ్యోతి కొడిగట్టిపోకుండా.. ఆ జ్యోతిని కాపాడేందుకు రెండు చేతులూ అడ్డుగా పెట్టి.. సఫలీకృతం అయ్యారు. నాటక రంగాన్ని బతికించి.. ఆ వెలుగులను చేతనైనంత మేర పంచారు. బాదంగీర్ సాయి తన జీవితాన్ని నాటకానికే అర్పించారు. ఆయన స్థాపించిన 'రంగసాయి నాటక గ్రంథాలయం' దేశంలోనే తొలి నాటక గ్రంథాలయం. బాదంగీర్ సాయి ఈ రోజు మన మధ్యలేకపోయినా.. నాటకం బతికున్నంత కాలం జీవించే ఉంటారు.

సీతమ్మధార: ప్రముఖ కళా సేవకుడు, రంగసాయి నాటక సంఘం, రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. మురళీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన కొంతకాలంగా బ్రెయిన్ హ్యామెరెజ్ సమస్యలతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. నాటక కళాకారుడైన బాదంగీర్ సాయి నటనతో సరిపెట్టుకోకుండా.. నాటక వికాసానికి తన వంతు కృషి చేసేందుకు నిరంతరం పరితపించారు. ఈ క్రమంలో నాటక ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. దేశ, విదేశాల్లో ప్రసిద్ధి గాంచిన సురభి నాటకాలను విశాఖలో 40 రోజుల పాటు ప్రదర్శింపజేసిన ఘనత సాయికే దక్కుతుంది. 2010లో ఏర్పాటు చేసిన రంగసాయి నాటక సంఘం సంస్థ ద్వారా విశిష్ట ప్రేక్షకాదరణ పొందిన అనేక నాటకాలను ఇక్కడి కళాభిమానులకు పరిచయం చేశారు. తెలుగు నాటక రంగ దినోత్సవం, ప్రపంచ నాటక రంగ దినోత్సవాల సందర్భంగా మరుగునపడిన కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో పాటు వారిని ఘనంగా సత్కరించి అందరివాడిగా పేరొందారు. బాదంగీర్ సాయి పార్థివదేహాన్ని మురళీనగర్‌లోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. పలువురు ప్రముఖులు, కళాకారులు ఆయన భౌతిక కాయానికి ఘన నివాళులర్పించారు. బాదంగీర్ సాయి అంత్యక్రియలు శుక్రవారం కంచరపాలెం దరి బర్మాక్యాంపు శ్మశాన వాటికలో జరుగుతాయని సమాచారం. ఆయన మరణం కళాకారులు, రచయితలను శోకసంద్రంలో ముంచేసింది.



బాదంగీర్ సాయి భౌతికకాయం

అమలాపురం నుంచి విశాఖకు..

బాదంగీర్ సాయి అసలు పేరు ఆశపు వీర వెంకట సత్యనారాయణమూర్తి. తూర్పుగోదావరి జిల్లా అమలాపురం ఆయన స్వస్థలం. ఆశపు విశ్వేశ్వరరావు, పుణ్యవతి దంపతులకు 1961లో జన్మించారు. 1979లో అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయంతో రంగస్థలం ప్రవేశం చేశారు. ఆయన మిమిక్రీలో 2003లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో డిప్లమో పొందారు. 1981లో 'ఇదేనా మన వ్యవస్థ' అనే నాటకంతో నాటక అనుభవం ప్రారంభమైంది. 1985లో కుటుంబంతో సహా విశాఖ వచ్చి స్థిరపడ్డారు. ఆయనకు భార్య హైమావతి, కుమార్తె నవ్య, కుమారుడు వీరేష్ ఉన్నారు. తొలుత బాదం, బాదం కోవా విక్రయించే వ్యాపారం మొదలుపెట్టారు. ఆ వ్యాపారంలో రాణించడంతో.. ఆయన పేరు బాదంగీర్ సాయిగా మారింది. తొలినాళ్లలో బాదంగీర్ సాయి ఆర్కెస్ట్రా నిర్వహించేవారు. అలా పలువురు కళాకారులతో ఏర్పడిన పరిచయాలతో నాటక రంగం మీద దృష్టి సారించారు. టర్నర్ చౌల్ట్రీలో సురభి నాటకాలను తొలిసారిగా ప్రదర్శింపజేయడంలో కీలక పాత్ర పోషించారు. అంబేద్కర్ నాటకం వంటి ప్రయోగాత్మక నాటకాలను ప్రదర్శించడానికి కూడా ఆయన ప్రోత్సాహం అందించారు. నాటకరంగం కోసం పలు వర్క్‌షాప్‌లు నిర్వహించి, చిన్నపిల్లలు, ఔత్సాహిక కళాకారులకు ఉచిత శిక్షణ ఇచ్చారు. బాదంగీర్ సాయి పలు సినిమాల్లో నటించారు. అలీబాబా అరడజను దొంగలు, ఓరేయ్ రిక్షా, ముద్దుల ప్రియుడు, దొంగరాముడు అండ్ పార్టీ, మేఘం, కాదంటే ఔననిలే, హీరో, బ్లేడ్ బాబ్జీ, అలస్యం అమృతం తదితర సినిమాల్లో నటించారు. అందరూ దర్శకులే టెలీ ఫిల్మ్‌ను నిర్మించారు. అరవైలో ఇరవై పేరిట మరో టెలీ ఫిల్మ్‌ను నిర్మించగా, కేకే సత్యనారాయణ దర్శకత్వం వహించారు. 'రంగసాయి నాటక గ్రంథాలయం' స్థాపించి అనేక మంది కళాకారులకు మార్గదర్శకుడిగా నిలిచారు. రామ్ చరణ్ నటించిన తొలి చిత్రం 'చిరుత' డిస్ట్రిబ్యూటర్‌గా బాదంగీర్ సాయి వ్యవహరించారు. సాయి తన కుమారుడు వీరేష్‌ను హీరోగా తీర్చిదిద్దాలని కలలుకన్నారు. రాకేష్ రెడ్డి దర్శకత్వంలో 'బర్గర్' సినిమా చేయాలనే కల నెరవేరకుండానే ఆయన మరణించారు. బాదంగీర్ సాయి తన జీవితాన్ని కళకే అంకితం చేశారు. విశాఖపట్నంలో నాటక కళాభివృద్ధికి బాదంగీర్ సాయి చేసిన కృషి అనిర్వచనీయమని పలువురు గుర్తు చేసుకుంటున్నారు.

సాయి మరణం బాధాకరం



ప్రముఖ కళారంగ సేవకుడు బాదంగీర్ సాయి అకాల మరణం కళా రంగానికి తీరని లోటు. అంతరించి పోతు న్న కళలను ప్రోత్సహించిన మహోన్నత వ్యక్తి సాయి. అతని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటున్నా.

– చెన్నా తిరుమలరావు, ప్రధాన కార్యదర్శి, విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం

కళాభిమానిని కోల్పోయాం

ప్రముఖ కళాకారుడు బాదంగీర్ సాయి నిగర్వి, నిరాడంబరుడు. సాయి మరణంతో విశాఖ ఒక ప్రముఖ కళాభిమానిని కోల్పోయింది. నాటికలు, నాటక పుస్తక లైబ్రరీ ఏర్పాటు చేసి, అందులో రిహార్సల్స్ కూడా నిర్వహించేవారు. సురభి నాటకాలు విశాఖలో ప్రదర్శించడానికి ఆయనే కర్త, కర్మ, క్రియ. ఆయన అకాలమరణం విశాఖ కళాకారులకు తీరని లోటు. –ఎ.అజశర్మ, ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

దేశంలోనే తొలి నాటక గ్రంథాలయం

అధునాతన కళలకు చోదక శక్తిని అందించేది రంగస్థలమని సాయి నమ్మారు. నాటక సృజనను భవిష్యత్ తరాలకు అందివ్వాలని నాటక పుస్తకాల సేకరణ ప్రారంభించారు. అలా పురుడుపోసుకున్నదే ద్వారకానగర్‌లోని టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని 'రంగసాయి నాటక గ్రంథాలయం'. దేశంలోనే తొలి నాటక గ్రంథాలయంగా నిలిచింది. నాటక కళను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సాయి ఏడేళ్ల పాటు పలువురు నటులు, నాటక రచయితలు, సంస్థల నుంచి నాటక గ్రంథాలను సేకరించారు. 2008లో దొండపర్తిలోని ప్రైవేట్ భవనంలో ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించి, తర్వాత టీఎస్సార్ కాంప్లెక్స్‌కు తరలించారు. ఈ గ్రంథాలయం దేశంలోని నాటక ప్రియులకు అమూల్యమైన నిధిగా నిలిచింది.

సత్కారాలు.. సన్మానాలు..



తనికెళ్ల భరణి నుంచి చిరు జ్ఞాపిక అందుకుంటున్న బాదంగీర్ సాయి(ఫైల్)

బాదంగీర్ సాయిని పలు కళాసంస్థలు సముచితరీతిలో సత్కరించాయి. ఇటీవల జరిగిన బాలబాట 17వ వార్షికోత్సవంలో బాదంగీర్ సాయిని ఘనంగా సన్మానించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 11న రంగసాయి కళాపీఠం స్థాపించిన పోస్టర్‌ను కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ రమణమూర్తి ఆవిష్కరించారు. ఈ ఏడాది ఆగస్టులో కీర్తి ఆర్ట్స్ అకాడమీ(హైదరాబాద్) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి డ్యాన్స్ ఫెస్టివల్ సందర్భంగా ఆయన్ని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆగస్టులో కళాభారతిలో జరిగిన రంగసాయి వార్షికోత్సవాల్లో భాగంగా సినిమా నటుడు తనికెళ్ల భరణికి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. ఆ సన్మాన సభలో బాదంగీర్ సాయి ఉత్సాహంగా పాల్గొన్నారు. 2014లో బాదంగీర్ సాయిని అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య, సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు సురభి పురస్కారంతో ఘనంగా సత్కరించారు.

రేపటి నుంచి 'ట్వంటీ- 20'

- ఎస్ఎంఏ టోర్నీకి విశాఖ సిద్ధం
- ప్రాక్టీస్ చేసిన దేశవాళీ టీ–20 జట్లు



విశాఖ స్పోర్ట్స్: దేశవాళీ ధనాధన్(టీ–20) క్రికెట్‌కు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. దేశంలోని 38 జట్లు ఐదు గ్రూప్‌ల్లో సయ్యద్ ముస్తాక్ అలీ(ఎస్ఎంఏ) ట్రోఫీలో తలపడుతుండగా విశాఖ వేదికగా గ్రూప్ డీ పోటీలు జరగనున్నాయి. బుధవారం విశాఖ చేరుకున్న జట్లు గురువారం ప్రాక్టీస్ మొదలుపెట్టాయి. ఉదయం విదర్భ జట్టు, మధ్యాహ్నం అసోం, రైల్వేస్, సాయంత్రం పుదుచ్చేరి, చండీగఢ్ జట్లు ప్రాక్టీస్ చేశాయి. ఒడిశా, చత్తీస్‌గఢ్ జట్లు శుక్రవారం ప్రాక్టీస్ చేయనున్నాయి. వైఎస్సార్ స్టేడియంలో ఈ నెల 23 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు రోజు విడిచి రోజు పోటీలు జరగనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఆడనున్న ఏడు జట్లలో గతేడాది విదర్భ జట్టు డీ గ్రూప్ విజేతగా నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోగా అసోం బీ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచి ప్రీక్వార్టర్స్ ఆడింది. అయితే విదర్భ జట్టు క్వార్టర్స్‌లోనే వెనుదిరగ్గా.. అసోం జట్టు సెమీస్‌కు చేరుకుంది. రైల్వేస్, ఒడిశా, చత్తీస్‌గఢ్ జట్లు ఆయా గ్రూప్‌ల్లో ఐదోస్థానంలో నిలిచి.. గ్రూప్ స్టేజ్‌లోనే వెనుదిరిగాయి. చండీగఢ్ ఆరో స్థానంలో, పుదుచ్చేరి ఏడో స్థానంలో నిలిచి నిరాశపరిచాయి. కాగా.. ఆంధ్రా జట్టు సీ గ్రూప్‌లో ఏడు మ్యాచ్‌లాడి మూడు విజయాలు, నాలుగు పరాజయాలతో ఆరో స్థానంలో నిలిచింది. ఈ సారి ఆంధ్రా 'ఈ' గ్రూప్‌లో ఆడనుంది.

ప్రత్యేక ఆకర్షణగా రియాన్ పరాగ్, అశితోష్

రియాన్ పరాగ్, అశితోష్ శర్మ గతేడాది టోర్నీలో టాపర్లుగా నిలిచారు. అసోం తరఫున ఆడిన రియాన్ పరాగ్ 10 ఇన్నింగ్స్‌లో 510 పరుగులతో టాప్ రన్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక రైల్వేస్ తరఫున ఆడిన అశితోష్ శర్మ ఆరు ఇన్నింగ్స్‌లు ఆడి 277.27 స్ట్రయిక్ రేట్‌తో టాపర్‌గా నిలిచాడు. ఈ సారి వీరిద్దరూ విశాఖ వేదికగా మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఇక జాతీయ జట్టు, ఐపీఎల్‌లో ప్రతిభ చూపిన ఆటగాళ్లు ఎస్ఎంఏ ట్రోఫీలోనూ ఆడనున్నారు. మహ్మద్ షమీ బెంగాల్‌కు, శ్రేయస్ అయ్యర్ ముంబయి జట్టుకు ఆడనుండగా.. కృనాల్ నాయకత్వంలో అతని సోదరుడు హార్దిక్ పాండ్యా బరోడా తరఫున బరిలోకి దిగుతున్నాడు. గతేడాది టైటిల్ పోరులో పంజాబ్ చేతిలో బరోడా ఓడింది.

ఇంపాక్ట్ ప్లేయర్ రద్దు: తొలిసారిగా దేశవాళీ టీ–20 ఎస్ఎంఏ ట్రోఫీలోనే ఇంపాక్ట్ ప్లేయర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ విధానాన్ని కొనసాగిస్తూ ఐపీఎల్‌లో ప్రవేశపెట్టగా.. ఆశించిన స్థాయిలో ఫలితమివ్వలేదు. ఈ క్రమంలో ఈ ట్రోఫీతో పాటు ఐపీఎల్‌లోనూ మూడేళ్ల పాటు ఈ విధానాన్ని రద్దు చేశారు.

టెస్ట్‌ల్లో నేడు నితీష్ అరంగేట్రం?



విశాఖ స్పోర్ట్స్: విశాఖపట్నం క్రికెట్‌కు ఇది గర్వించదగిన రోజు కానుంది. భారత టెస్ట్ జట్టుకు విశాఖ నుంచి ఎంపికైన రెండో ఆటగాడిగా నితీష్‌కుమార్ చరిత్రను లిఖించిన సంగతి తెలిసిందే. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా శుక్రవారం నుంచి పెర్త్‌లో జరిగే తొలి టెస్ట్ మ్యాచ్‌లో అరంగేట్రం చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికే విశాఖ నుంచి టెస్ట్ మ్యాచ్‌లాడిన తొలి క్రికెటర్‌గా భరత్ నిలిచాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన స్వల్ప వ్యవధిలోనే టెస్ట్ జట్టుకు నితీష్ కుమార్ ఎంపిక కావడం వెనుక అతని కృషి ఎంతో ఉంది. కొన్ని రోజులుగా ఆస్ట్రేలియా పిచ్‌లపై ప్రాక్టీస్ చేస్తున్న నితీష్.. అక్కడ జరిగిన ఆస్ట్రేలియా ఏ–భారత్ ఏ అనధికార రెండు టెస్ట్‌ల్లోనూ ఆడాడు. తొలుత అనధికార టెస్ట్‌లకే అతన్ని ఎంపిక చేసినప్పటికీ.. ఆస్ట్రేలియా పిచ్‌లు మీడియం ఫాస్ట్‌కు అనుకూలంగా ఉండటం, సీమర్‌గా తన బౌలింగ్ మెరుగుపరుచుకోవడంతో అధికారిక టెస్ట్‌లాడే జట్టుకు నితీష్ ఎంపికయ్యాడు.

బౌలింగ్ కోచ్ ఏమన్నారంటే..

భారత్ బ్యాటింగ్ ఆర్డర్ బలంగా ఉన్నా.. పెర్త్ టెస్ట్‌కు నలుగురు కుర్రాళ్లను పరిశీలించే వీలుందని భారత్ బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ పేర్కొన్నారు. పెర్త్‌లోని పరిస్థితుల నేపథ్యంలో భారత బౌలింగ్ అటాక్ ఆస్ట్రేలియా జట్టుకు ఇబ్బంది కలిగిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అందుకే తుది జట్టులో నితీష్ కుమార్‌ని తీసుకునే అవకాశాలున్నాయని వివరించారు.

డీఎంహెచ్‌వోకి జైలు ఫార్మాసిస్ట్ సరెండర్

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు గంజాయి సరఫరా చేసే యత్నంలో అధికారులకు చిక్కిన ఫార్మాసిస్ట్ కడియం శ్రీనివాస్‌ను జైలు అధికారులు డీఎంహెచ్‌వోకి సరెండర్ చేశారు. డిప్యూటేషన్‌పై జైలులో ఫార్మాసిస్ట్‌గా పనిచేస్తున్న కడియం శ్రీనివాస్ ఈ నెల 19న భోజనం క్యారేజీలో గంజాయి తీసుకెళ్తూ దొరికిపోయిన సంగతి తెలిసిందే. కట్టుదిట్టమైన భద్రత ఉన్న జైలు లోపలకు గంజాయి తీసుకువెళ్లే ప్రయత్నం చేసిన శ్రీనివాస్ తమకు అవసరం లేదని జైలు పర్యవేక్షణాధికారి ఎస్.కిశోర్ కుమార్ గురువారం తెలిపారు. ఆయన స్థానంలో మరో ఫార్మాసిస్ట్‌ను పంపించాలని డీఎంహెచ్‌వోను కోరామన్నారు. ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం బాధాకరమని, మరోసారి ఇలా జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

ఫార్మాసిస్ట్ వద్ద గంజాయి.. ఎక్కడిది?

ఫార్మాసిస్ట్ శ్రీనివాస్‌కు గంజాయి ఎక్కడ నుంచి లభించదనే దానిపై చర్చ జరుగుతోంది. ఏడాది కాలంగా ఆయన జైలులో ఫార్మాసిస్ట్‌గా పని చేస్తున్నారు. ఇలా ఎన్నిసార్లు గంజాయిని లోపలకు తీసుకెళ్లి ఖైదీలకు అందించాడోననే ప్రశ్నలను స్థానికులు లేవనెత్తుతున్నారు. ఆయన ఎక్కడి నుంచి గంజాయి తీసుకువస్తున్నాడో పోలీసులు ఆరా తీస్తే.. గంజాయి సరఫరా ముఠా బయటపడుతుందని పలువురు సూచిస్తున్నారు. శ్రీనివాస్‌కు రాజకీయ నాయకులు, పలువురు పోలీస్ అధికారులతో సంబంధాలు ఉన్నట్లు సమాచారం. అందుకే ఆయనకు ఆరిలోవ పోలీసులు అతిథి మర్యాదలు చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. సాధారణంగా పోలీస్ లాకప్‌లో ఉన్న వారికి మర్యాదలు చేయకుండా నేలపైనే భోజనం పెడతారు. శ్రీనివాస్‌కు మాత్రం మధ్యాహ్న భోజనం టేబుల్‌పై పెట్టినట్లు తెలిసింది.

25 నుంచి బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక ట్రయిల్స్ ఈనెల 25 నుంచి పోలీస్ బారెక్స్ గ్రౌండ్స్‌లో జరగనున్నాయి. జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో మెన్, వుమెన్ జట్ల ఎంపికకు మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం డిసెంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా మారుటేరులో జరగనున్న పోటీలకు జట్లను ఎంపిక చేయనున్నారు.

గంజాయి కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి కలిగి ఉన్న వ్యక్తికి 10 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని ఒకటో ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ గురువారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా చెల్లించాలని లేకుంటే అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.ఎస్.ఎన్.వి.ప్రసాదరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2021 ఆగస్టు 19వ తేదీ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో అనకాపల్లి జిల్లా కొత్తూరు పోలీసులు సోదాలు నిర్వహించగా రోడ్డు పక్కన ఇద్దరు వ్యక్తులు 20 కిలోల గంజాయి, రూ.2 వేల నగదుతో పట్టుబడారు. వీరిపై కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన హర్షిత్ ఖాన్‌కు 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించారు.

30న రవాణా శాఖలో వాహనాల వేలం

విశాఖ విద్య: తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈ నెల 30న ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు జిల్లా రవాణా శాఖ ఉప రవాణా కమిషనర్ జి.ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గడువు పూర్తయినా నిబంధనల మేరకు అపరాధ రుసుము, పన్నులు చెల్లించకుండా వాహనాలను వదిలేసిన వారి నుంచి స్పందన లేకపోవడంతో బహిరంగ వేలానికి నిర్ణయించామని పేర్కొన్నారు. వేలం ముందు రోజు వరకు సదరు యజమానులు/ఫైనాన్సియర్స్ కట్టాల్సిన పన్నులు, అపరాధ రుసుము చెల్లించి వాహనాన్ని తీసుకెళ్లవచ్చన్నారు. సీజ్ చేసిన వాహనాలను మద్దిలపాలెం, మధురవాడ, సింహాచలం ఆర్టీసీ డిపో ప్రాంగణాల్లో, గంభీరం ఆఫీసు డ్రైవింగ్ ట్రాక్ వద్ద ఉంచామన్నారు. వేలంలో పాల్గొనే వారు ధరావత్తు రూ.10 వేలు చెల్లించాలన్నారు. వేలంలో వాహనం పొందినవారు మొత్తం సొమ్ము అదే రోజు చెల్లించి మూడు రోజుల్లోగా వాహనం తీసుకెళ్లాలన్నారు.

ప్రభుత్వ తోడ్పాటుతోనే మత్స్యకారుల అభ్యున్నతి



భోజనం వడ్డిస్తున్న మేయర్

ఏయూ క్యాంపస్: మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని నగర మేయర్ జి.హరివెంకట కుమారి అన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బీచ్‌రోడ్డులో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సముద్రంలో వేటకు వెళ్లడం ప్రమాదాలతో కూడుకున్నదని, మత్స్యకారుల జీవనం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని పేర్కొన్నారు. మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వాలు మరిన్ని రాయితీలు అందించాలన్నారు. ఆధునిక సాంకేతికతను వీరికి చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అల్లిపిల్లి ఎల్లాజీ, మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు ఇతర నాయకులు పాల్గొన్నారు. అనంతరం మేయర్ స్వయంగా మత్స్యకారులకు భోజనాలు వడ్డించారు.

రూ.178 కోట్లతో హార్బర్ ఆధునికీకరణ

- కలెక్టర్ హరేందిర ప్రసాద్
- ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం



ఆధునిక మెరైన్ మ్యూజియంను తిలకిస్తున్న కలెక్టర్

మహారాణిపేట: 'సముద్రం కలుషితం కాకుండా కాపాడాలి. మత్స్య సంపదను అభివృద్ధి చేస్తూ భావితరాలకు అందించాలి. ఈ విషయంలో మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలి.' అని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సముద్ర మత్స్య సంపద పరిరక్షణ, నిర్వహణ, సంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధిని కాపాడడం తదితర అంశాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. జిల్లాలో 32 తీర ప్రాంత గ్రామాలు ఉండగా.. 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. బోట్లకు 100 శాతం రాయితీతో ట్రాన్స్ పాండర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.178 కోట్లతో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద ఫిష్ స్టాళ్లను ఏర్పాటు చేయడం, చేపల రవాణా వాహనాలు, ఫిష్ కేజ్ కల్చర్ యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. బోట్ల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, వ్యర్థాలను సముద్రంలో వేయవద్దని సూచించారు. మెరైన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రవివర్మ మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంత పరిరక్షణకు మత్స్యకారుల సహకారం అవసరమన్నారు. రింగ్ వలలు, ఇతర సమస్యలపై ప్రభుత్వం, కోర్టులు సూచించిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్లాస్టిక్, వ్యర్థ వలలు కారణంగా చేపలకు జరిగే నష్టాలను వివరించారు. ముందుగా భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ఆధునికీకరించిన మెరైన్ మ్యూజియంను కలెక్టర్ తిలకించారు. సదస్సులో సంస్థ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి, శాస్త్రవేత్త జీవీఏ ప్రసాద్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ రమణమూర్తి, పలు కేంద్ర మత్స్య పరిశోధన సంస్థల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై దాడి కేసులో పోలీసుల విచారణ

ఆస్పత్రి వార్డుల్లో సీసీ టీవీ ఫుటేజీ సేకరణ

విశాఖ విద్య: గోపాలపట్నం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో వైద్యురాలిపై రోగి బంధువులు దాడి చేసిన ఘటనలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదు చేసిన మహిళా వైద్యురాలు గురువారం స్టేషన్‌కు వెళ్లి, మరిన్ని వివరాలను అందించినట్లు తెలిసింది. కేసు విచారణలో భాగంగా వార్డుల్లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పోలీసులు సేకరించారు. పోలీసు అధికారులు సైతం ఆస్పత్రికి వెళ్లి విచారణ చేపట్టినా, గోప్యత పాటిస్తుండటంపై అనేక సందేహాలు ముసురుకుంటున్నాయి. ఫిర్యాదు చేసి నాలుగు రోజులవుతున్నా, విచారణలతోనే సరిపుచ్చుతూ, పోలీసులు కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. దీనిపై ఆస్పత్రిలోని మిగతా వైద్యులు, సిబ్బంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే తాము విధులు ఎలా నిర్వర్తించాలని వాపోతున్నారు. వైద్యురాలిపై దాడికి పాల్పడిన వ్యక్తి కూటమి కార్యకర్త కావటంతో, దీనిపై రాజీ ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయని సమాచారం. కూటమి వార్డు అధ్యక్షుడితో పాటు, పార్టీ ఇతర నాయకులు కూడా దీనిలో జోక్యం చేసుకుని వైద్యురాలిపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది.

పోక్సో కేసులో యువకుడికి రిమాండ్


సీతమ్మధార: మాయమాటలు చెప్పి బాలికను నమ్మించి, తీసుకెళ్లిన ఓ యువకుడిపై ద్వారకా స్టేషన్ పోలీసులు పోక్సో కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాలు. రామాటాకీస్ దరి శ్రీనగర్‌కి చెందిన బాలిక(17) ఇంటర్ చదువుతోంది. ఆమెకి ఇన్‌స్టాగామ్‌లో గోపాలపట్నం ప్రాంతానికి చెందిన డ్యాన్స్ మాస్టర్ శ్రీకేశవ్ అలియాస్ బన్నీ(23)తో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ నెల 16న సదరు బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఎంతకీ తిరిగిరాలేదు. దీంతో బాలిక తల్లి ద్వారకా స్టేషన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బన్నీపై అనుమానంతో ఆరా తీయగా అతను కూడా కనిపించకుండా పోయాడు. మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు గురువారం అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు అతని మీద ద్వారకా ఇన్‌చార్జి ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ డీవీ రత్నం దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచార నిందితుల్ని కఠినంగా శిక్షించాలి

- మద్యం, డ్రగ్స్, అశ్లీల చిత్రాలపై నిషేధం విధించాలి
- నిరసన ప్రదర్శనలో పీడీఎస్‌వో ప్రతినిధులు



ఆర్టీసీ కాంప్లెక్సు కూడలిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



గాంధీపార్కు వద్ద నిరసన ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార: ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు కారణమవుతున్న విష సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్‌వో) రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను పిలుపునిచ్చారు. ఇటీవల సామూహిక అత్యాచారానికి గురైన బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద గురువారం నిరసన తెలిపారు. అనంతరం కాంప్లెక్స్ మీదుగా తెలుగుతల్లి ఫ్లైఓవర్ వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. అక్కడి నుంచి రామాటాకీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాను మాట్లాడుతూ విద్యార్థినిపై ప్రేమ పేరుతో మోసం చేసి, మిత్రులతో కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన హేయమైనదని, ఈ దారుణంలో భాగస్వామ్యం ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో అత్యాచార ఘటనల పరంపర కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనలు జరిగిన ప్రతిసారి కఠినమైన చట్టాలు తీసుకొస్తామని పాలకులు అంటున్నారు తప్ప, మూల కారణాలైన మద్యం, మత్తు పదార్థాలు, అశ్లీల సినిమాలు, వీడియోల నిషేధానికి ఎలాంటి ప్రయత్నాలు చేయట్లేదని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం దేశంలో రోజుకు 86 మంది మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. ఇది కేవలం నమోదవుతున్న కేసుల సంఖ్య మాత్రమేనని ఇంకా బయటకు రాని ఘటనలు అనేకం ఉంటాయన్నారు. ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను తీసుకురావటమే కాకుండా, మూల కారణాలను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.రుద్రి, జిల్లా కమిటీ సభ్యులు జానకి, లోకేష్, లైకాన్, తేజ, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మేమే మేటి.. లేరు సాటి!

ఘనంగా ముగిసిన విశాఖ బాలోత్సవం



మట్టితో బొమ్మలు తయారు చేస్తున్న విద్యార్థులు

డాబాగార్డెన్స్: మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ ప్రాథమిక పాఠశాల వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న విశాఖ బాలోత్సవం గురువారంతో వైభవంగా ముగిసింది. మట్టితో పక్షులు, పల్లె బొమ్మల తయారీతో మూడో రోజు ఈవెంట్స్ ప్రారంభమయ్యాయి. చిన్నారుల జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, మైమ్, ఫ్యాన్సీ డ్రెస్‌తో పాఠశాల ప్రాంగణం రంగులద్దుకుంది. స్నేహం, సమాజ సేవ అంశాలపై తెలుగులో మాట్లాడడం, వేమన, సుమతి వంటి పద్యాలకు భావాలు వ్యక్తపరుస్తూ, అందుకు అనువైన దుస్తులు ధరించడంతో పద్యానికి పట్టాభిషేకం చేసినట్టయింది. జీవిత నైపుణ్యాలు ప్రతిబింబించేలా ఫైర్ లెస్ కుకింగ్‌లో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. సమకాలీన అంశాలతో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు తమ సత్తాను చాటారు. మొత్తం 120 పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమంలో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. బాలోత్సవం కమిటీ కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు, అధ్యక్షుడు పి.రఘు, ఉపాధ్యక్షురాలు కె.రమాప్రభ, కమిటీ సభ్యులు ఎం.ఎల్లాజీ, వై.సత్యనారాయణ, ఎం.గుణశంకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.